క్లుప్తంగా

గురుకుల పాఠశాల విద్యార్థుల ప్రతిభ


విజేతలుగా నిలిచిన పెనుగొండ గురుకుల పాఠశాల విద్యార్థులు

పెనుగొండ: శృంగవృక్షంలో నిర్వహించిన జిల్లా సెంట్రల్ జోన్ బాలబాలికల క్రీడా పోటీల్లో పెనుగొండ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి విజయకేతనం ఎగురవేశారని ప్రిన్సిపాల్ టి.ఎస్తేరు క్వీనీ తెలిపారు. శనివారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ కబడ్డీలో ప్రథమ స్థానం, కో–కోలో రన్నర్స్‌గానూ, అథ్లెటిక్స్‌లో 400 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానంలోనూ నిలిచారన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, పీఈటీ వెంకటలక్ష్మీ అభినందించారు.

ఆకుకూరలతో పౌష్టికాహారం


మునమర్రులో ఆకుకూరలను పంపిణీ చేస్తున్న సీడీపీఓ కృష్ణకుమారి

పెనుగొండ: ఆకుకూరలతో గర్భిణులకు, బాలింతలకు సమతుల్య పౌష్టికాహారం అందుతుందని, తద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం జరుగుతుందని ఐసీడీఎస్ సీడీపీఓ ఎ.కృష్ణకుమారి అన్నారు. శనివారం మునమర్ర అంగన్‌వాడీ కేంద్రం వద్ద పండించిన ఆకుకూరలను పోషణ వాటికలో భాగంగా గర్భిణులకు, బాలింతలకు పంపిణీ చేశారు. అనంతరం పెనుగొండ యర్రా నారాయణ స్వామి కాలనీలో భేటీ బచావో–భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా కిశోర బాలికలతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజరు బి.సుజాత, టీచర్ వై.హేమ, వీవీవీ నాగలక్ష్మీ, జి.మణి పాల్గొన్నారు.

దుర్గా లక్ష్మణేశ్వరుని హుండీ ఆదాయం లెక్కింపు


లక్ష్మణేశ్వరంలో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: మండలంలోని లక్ష్మణేశ్వరంలో ఉన్న శ్రీదుర్గా లక్ష్మణేశ్వర స్వామి వారి దేవాలయంలోని హుండీ ఆదాయాన్ని శనివారం లెక్కించారు. భీమవరం ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ వర్ధినీడి వెంకటేశ్వరరావు సమక్షంలో శివరాత్రి తర్వాత ఆలయ హుండీని తెరిచి లెక్కించారు. రూ.3,61,401లు హుండీ ఆదాయంగా వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి ఆర్‌వీవీఎస్ రామచంద్రకుమార్, మొగల్తూరు మండల కార్యనిర్వాహణాధికారి బి.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఇండోర్ పరీక్షల్లో టాపర్‌గా సాహిబా అంజుమ్


సాహిబా అంజుమ్

పెనుమంట్ర: విశాఖపట్నంలో జరిగిన పోలీస్ పేరెడ్ సివిల్ విభాగం ఇండోర్ పరీక్షల్లో మార్టేరు గ్రామానికి చెందిన సాహిబా అంజుమ్ టాపర్‌గా నిలిచింది. శనివారం వైజాగ్ పేరెడ్ గ్రౌండ్‌లో జరిగిన కార్యక్రమంలో హోంమంత్రి వంగలపూడి అనిత చేతుల మీదుగా పోలీస్ మెడల్, ట్రోఫీని అందుకున్నారు. సాహిబా అంజుమ్ మాట్లాడుతూ తండ్రి సహముద్దీన్, భర్త సద్దాం సాధిక్‌ల సహకారంతో ఈ స్థాయికి చేరుకున్నానని చెప్పారు. రాబోయే రోజుల్లో గ్రూప్ 1, సివిల్స్ సాధించడమే తన లక్ష్యమని తెలిపారు.

ఏఎస్ఎన్ఎం కళాశాలలో ఫలితాల విడుదల

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ మొదటి సెమిస్టర్ ఫలితాలు విడుదల చేశారు. శనివారం ఫలితాలు విడుదల చేసిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి మాట్లాడుతూ ఫిబ్రవరిలో మొదటి సెమిస్టర్ పరీక్షలు నిర్వహించామన్నారు. మొత్తం మూడు గ్రూపులకు గాను 80 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. కార్యక్రమంలో టి.కృష్ణ పాల్గొన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు

నరసాపురం: మతిస్థిమితం లేని మహిళ అదృశ్యం శనివారం కేసు నమోదు చేసినట్టు టౌన్ ఎస్సై సీహెచ్ విజయలక్ష్మి చెప్పారు. పట్టణంలోని అరుంధతీపేటకు చెందిన ఉన్నమట్ల రాజు శనివారం ఉదయం మతిస్థిమితం లేని తన భార్య శృతికుమారితో కలసి స్టీమర్‌రోడ్డులోని అన్న క్యాంటీన్ వద్దకు వచ్చాడు. అయితే కొద్దిసేపటికి భార్య అక్కడ కనిపించలేదు. దీంతో చుట్టు పక్కల ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడు.

బర్డ్‌ఫ్లూ భయంతో చికెన్ వ్యాపారం ఢమాల్

- పడిపోయిన చికెన్, గుడ్ల అమ్మకాలు
- కలెక్టర్ ప్రకటనతో వ్యాపారుల్లో ఆనందం



మేడపాడులో మూతపడిన చికెన్ దుకాణం

యలమంచిలి: జిల్లాలోని వేల్పూరు గ్రామంలోని కృష్ణానందం కోళ్ల ఫారం నుంచి ఒక కిలోమీటర్ పరిధిలో, పెదతాడేపల్లి గ్రామంలోని రామలక్ష్మి కోళ్ల ఫారం నుంచి ఒక కిలోమీటర్ పరిధిలో మినహా జిల్లాలోని అన్ని గ్రామాలలో కోడి గుడ్లు, కోడి మాంసం అమ్మేందుకు, కొనేందుకు ఎలాంటి ఆంక్షలు లేవని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి శుక్రవారం ప్రకటించిన నేపథ్యంలో కోడి గుడ్లు, కోడి మాంసం విక్రయదారులు, ఫౌల్ట్రీ రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ఒక వైపు బర్డ్ ఫ్లూ భయం, మరో వైపు మహాశివరాత్రి నేపథ్యంలో గడచిన రెండు వారాలుగా చికెన్, కోడి గుడ్ల అమ్మకాలు పూర్తిగా పడిపోయాయి. బర్డ్ ఫ్లూ వెలుగు చూసిన తర్వాత అమ్మకాలు లేక పౌల్ట్రీ రైతులు, చికెన్ సెంటర్ల నిర్వాహకులు భారీగా నష్టపోతున్నారు. గత ఆదివారం కూడా అమ్మకాలు అంతంత మాత్రం గానే ఉండటం పట్ల వ్యాపారులు ఆందోళన చెందారు. గత నెలలో యలమంచిలి మండలంలోని మేడపాడు, ఊటాడ గ్రామాలలో అంతుచిక్కని వ్యాధితో సుమారు ఏడు వేల కోళ్లు చనిపోయాయి. దీంతో పాలకొల్లు నియోజకవర్గం మొత్తంగా చికెన్ అమ్మకాలు పడిపోయాయి. అయితే ఆ రెండు గ్రామాల్లో చనిపోయిన కోళ్లకు బర్డ్ ఫ్లూ లేదని ల్యాబ్ రిపోర్టు రావడంతో అటు అధికారులు, ఇటు వ్యాపారులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ నేపథ్యంలోనే కలెక్టర్ కూడా ప్రజలు ఎలాంటి అపోహలు లేకుండా 70 డిగ్రీలకు పై బడిన ఉష్ణోగ్రతతో ఉడికించిన కోడి గుడ్లు, ఉడకబెట్టిన కోడి మాంసం తినవచ్చునని, చికెన్, గుడ్లు షాపులు, రెస్టారెంట్ యజమానులు వ్యాపారాలు కొనసాగించవచ్చని ప్రకటించడం మాంసహార ప్రియులకు కూడా ఊరట లభించినట్లయ్యింది.

బర్డ్ ఫ్లూ, శివరాత్రి ప్రభావం..

గడచిన 15 రోజులుగా చికెన్, కోడిగుడ్ల విక్రయాలు మందగించడానికి బర్డ్ ఫ్లూతో పాటు శివరాత్రి ప్రభావం కూడా ఉందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. గత నెల మొదటి వారంతో పోలిస్తే 70 శాతం వరకు అమ్మకాలు తగ్గినట్లు తెలుస్తోంది. శివరాత్రి వెళ్లింది కనుక చికెన్, గుడ్ల అమ్మకాలు పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పౌల్ట్రీ పరిశ్రమను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం చికెన్, గుడ్ల అమ్మకాలను పెంచే దిశగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుంది. ఈ క్రమంలోనే గత నెల 23న ఆదివారం భీమవరంలో చికెన్ మేళా నిర్వహించి, 70 డిగ్రీల పై బడిన ఉష్ణోగ్రతలో చికెన్, కోడి గుడ్లు ఉడకబెట్టి తినవచ్చని చెప్పినా పరిస్థితిలో మార్పు రాలేదని వ్యాపారులు వాపోయారు.

మటన్ ధరల పెరుగుదల

చికెన్‌పై ఇప్పటికీ వినియోగదారులు ఆసక్తి చూపని నేపథ్యంలో మటన్ ధరలను వ్యాపారులు మరింత భారీగా పెంచేశారు. మామూలు సమయంలో కిలో రూ.800 ఉండే మటన్ ధరను కిలో రూ.900, రూ.1000 వరకు పెంచి అమ్మకాలు సాగిస్తున్నారు. బర్డ్ ఫ్లూ నేపథ్యంలో చికెన్ అమ్మకాలను పెంచుకునేందుకు వివిధ ప్రాంతాల్లో ధర తగ్గించి అమ్ముతున్నారు. పాలకొల్లులో కిలో చికెన్ ధర గత వారం రూ.180 ఉంది. తాజాగా రూ.100/120 పెట్టారు. ధరలు తగ్గించినప్పటికీ అమ్మకాలు మాత్రం పెరగలేదని వ్యాపారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ స్వయంగా చికెన్, కోడి గుడ్లు నిరభ్యరంతంగా తిన వచ్చునని చేసిన ప్రకటన ప్రజల్లో మార్పు తీసుకువచ్చి, వ్యాపారం పుంజుకుంటుందని వ్యాపారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



నేను కట్టుపాలెం, మేడపాడు గ్రామాల్లో బ్రాయిలర్ కోళ్ల వ్యాపారం చేస్తాను. బర్డ్ ఫ్లూ వెలుగు చూసిన తర్వాత వ్యాపారం పూర్తిగా తగ్గిపోయింది. గత ఆదివారం వ్యాపారం బాగా ఉంటుందని ఆశించాం. కానీ నిరాశాజనకంగానే ఉంది. అమ్మకాలు ఇలా ఉంటే నష్టాలతో కోలుకోవడం కష్టం. బర్డ్ ఫ్లూ నేపథ్యంలో చికెన్, గుడ్ల అమ్మకాలను పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతోపాటు, నష్టపోయిన మాలాంటి వ్యాపారులను, ఫౌల్ట్రీ రైతులను ఆదుకోవాలి.

– బండి పెద్దిరాజు, చికెన్ విక్రయదారుడు

ఎంఎస్ఎంఈ సర్వేకు సహకరించాలి

నరసాపురం: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నరసాపురం మున్సిపాలిటీలో వ్యాపార దుకాణాల ఎంఎస్ఎంఈ సర్వే చేపట్టామని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. మున్సిపల్ సిబ్బంది వచ్చినప్పుడు షాపుల యజమానులు ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, జీఎస్టీ నెంబర్, బ్యాంకు అకౌంట్ నెంబర్ చూపించి సహకరించాలని సూచించారు.

నాటక రంగం ద్వారా సమాజంలో మార్పు


బీఎల్ఎం పురస్కారం అందుకుంటున్న శాంతారావు

పాలకొల్లు సెంట్రల్: నాటక రంగం ద్వారా సమాజంలో అనేక మార్పులు తీసుకురావచ్చని ఏపి మానవ హక్కుల వేదిక కార్యదర్శి ఏడిద రాజేష్ అన్నారు. శుక్రవారం రాత్రి పట్టణ లయన్స్ కమ్యూనిటీ హాలులో విద్యా చైతన్య సమాఖ్య ఆధ్వర్యంలో బుంగ లలితా మాధవరావు స్మారక నాటక పురస్కారం 2024 కార్యక్రమం నిర్వహించారు. ఏడిద రాజేష్ మాట్లాడుతూ పురస్కార గ్రహీత ప్రజానాట్య మండలి కళాకారులు నాటక రచయిత, దర్శకులు, శిక్షకులు కొసనం శాంతారావు గత 30 ఏళ్లగా నాటక రంగం ద్వారా సమాజం చైతన్య పరచడానికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. కొసనం శాంతారావు మాట్లాడుతూ నాటకం జాగృతస్వప్నం, పోరాట ఆయుధమని అన్నారు. ముందుగా కొసన శాంతారావుకకు లలితా మాధవరావు స్మారక నాటక పురస్కారంతో పాటు రూ. 20 వేలు నగదు అందించారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య కార్యదర్శి పోలిశెట్టి శ్రీశ్రీ, తోలేటి గాంధీ, జవ్వాది నాగేశ్వరరావు, మంచెం ఉమామహేశ్వరరావు, దిరిశాల వీరవెంకట ప్రసాద్, కింజరాపు దుర్గాప్రసాద్, చేగొండి కరుణ కుమార్ తదితరుపాల్గొన్నారు.

వైభవంగా రామలింగేశ్వరుని పుష్పోత్సవం


మేడపాడులో పుష్పోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

యలమంచిలి: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం మేడపాడు శివాలయంలో శ్రీఉమా సహిత రామలింగేశ్వరస్వామి పుష్పోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు బాదంపూడి చిరంజీవిశర్మ బ్రహ్మత్వంలో అడ్డాల వాసుదేవరావు, ఊర్మిళ ధనలక్ష్మి దంపతులు పుష్పోత్సవం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి దేవేరులను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన మహిళలందరికీ గంధం వీరాస్వాములు ఆర్థిక సాయంతో పసుపు, కుంకుమ, రవిక, గాజులు, పిల్లలకు పెన్ను, పుస్తకం పంపిణీ చేశారు. పూజ అనంతరం భక్తులకు అడ్డాల ఆదినారాయణ సోదరులు అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

నరసాపురం/పెనుగొండ: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ నరసాపురం, ఆచంట నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యాలయం నుంచి శనివారం ప్రకటన విడుదల చేశారు. పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులుగా నియమితులైన నాయకులను పార్టీ జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ కన్వీనర్ ముదునూరి ప్రసాదరాజు అభినందించారు. యూత్ వింగ్ అధ్యక్షుడిగా చినిమిల్లి చందు, మహిళా విభాగం అధ్యక్షురాలిగా అడిదల విజయశ్యామల, రైతు విభాగానికి దొంగ మోషేన్‌రావు, బీసీ సెల్ అధ్యక్షుడిగా పడివడ మార్కెండేయులు, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా కోడెల వెంటకరావు, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా గంధం శ్రీను, మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా షేక్ మీరాసాహెబ్(బాషీ), క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా చదలవాడ మెర్లిన్, స్టూడెంట్ వింగ్ అధ్యక్షుడిగా పంజా సత్యనారాయణ, పంచాయితీరాజ్ వింగ్ అధ్యక్షుడిగా బొక్కా రామస్వామి, మున్సిపల్ వింగ్ అధ్యక్షుడిగా బొంతు రాజశేఖర్, ఆర్టీఐ వింగ్ అధ్యక్షుడిగా బి.నర్సింహరావు, వలంటీర్స్ వింగ్ అధ్యక్షుడిగా గూడూరి దుర్గారావు, గ్రీవెన్స్ సెల్ వింగ్‌కు కడలి పెద్దిరాజు, వాణిజ్య విభాగం వింగ్‌కు యర్రా శ్రీనివాసరావు, వీవర్స్ వింగ్‌కు కర్రెళ్ల సూర్యప్రకాష్ నాగ ముక్తేశ్వరరావు, వైఎస్సార్ టీయూసీ అధ్యక్షుడిగా కనకపాటి ప్రసన్న కుమార్, అంగన్‌వాడీ వింగ్‌కు బొక్కా త్రివేణి, లీగల్ సెల్‌కు విన్నా సూర్యప్రకాశరావు, కల్చరల్ వింగ్‌కు కడలి సత్యనారాయణ, సోషల్‌మీడియా వింగ్‌కు బొక్కా నాగకుమార్, ఐటీ వింగ్‌కు గొల్లా సుజిత్, దివ్యాంగుల విభాగం అధ్యక్షుడిగా కొల్లాడ నాగరాజు, డాక్టర్స్ వింగ్‌కు చెల్లుబోయిన వరప్రసాద్ ఆంజనేయులు, ఇటిలెక్చువల్ ఫోరమ్స్ వింగ్‌కు పులపర్తి ప్రతాప్, బూత్‌కమిటీల వింగ్‌కు కావలి వెంకటరత్నం(నాని), పబ్లిసిటీ వింగ్‌కు నల్లి జయవరప్రసాద్ తదితరులు అనుబంధ విభాగాల అధ్యక్షులుగా నియమించారు.

ఆచంట నియోజకవర్గంలో ఇలా

ఆచంట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడిగా గొట్టుముక్కల సునీల్ వర్మ, మహిళా విభాగం అధ్యక్షురాలిగా బొక్కా అరుణ, రైతు విభాగం అధ్యక్షుడిగా చిటికెన నాగేంద్ర ప్రసాద్(బాబీ), బీసీ సెల్ అధ్యక్షుడిగా మొల్లేటి రామకృష్ణ, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా పిల్లి రుద్ర ప్రసాద్, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా బండి రాంబాబు, మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా షేక్ ఖాసీం సాహెబ్, క్రిష్టియన్ సెల్ అధ్యక్షుడిగా విప్పర్తి ప్రభాకరరావు, విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా కర్రి సత్య ప్రకాష్ రెడ్డి, పంచాయతీ రాజ్ వింగ్ అధ్యక్షుడిగా చిట్టిబత్తుల సువర్ణరాజు, వలంటీరు విభాగం అధ్యక్షుడిగా గొలుగూరి సాయి కిరణ్ రెడ్డి, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడిగా కుక్కల కిరణ్‌కుమార్, వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా నంబూరి రాజేంద్ర ప్రసాద్, వీవర్స్ విభాగం అధ్యక్షుడిగా వీర వీరభద్రం, వైఎస్సార్ టియూసీ అధ్యక్షుడిగా నక్కా సూర్యనారాయణ, లీగల్ సెల్ అధ్యక్షుడిగా సరేళ్ల లాజర్, కల్చరల్ విభాగం అధ్యక్షుడిగా గుడిమెట్ల శ్రీనివాస యెల్లా రెడ్డి, సోషల్ మీడియా అధ్యక్షుడిగా పోతుమూడి రామచంద్రరావు, ఐటీ వింగ్ అధ్యక్షుడిగా ద్వారంపూడి గీత విజయ శేఖర్ రెడ్డి, దివ్యాంగుల విభాగం అధ్యక్షుడిగా చదలవాడ ముత్యాలరావు, డాక్టర్ వింగ్ అధ్యక్షుడిగా బొక్కా సతీష్, ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షుడిగా దుర్గా దుర్గా ప్రసాదరావు, బూత్ కమిటీ అధ్యక్షుడిగా అల్లం భాస్కర్ రెడ్డి, ప్రచార కమిటీ అధ్యక్షుడిగా చింతపల్లి గురుప్రసాద్‌లను నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

గుడాల గోపిని కలసిన విన్‌స్టన్‌బాబు


గోపికి కృతజ్ఞతలు తెలుపుతున్న విన్‌స్టన్‌బాబు

పోడూరు: వైఎస్సార్‌సీపీ జిల్లా క్రిస్టియన్ మైనారిటీ విభాగం అధ్యక్షుడిగా నియమితులైన కుంచలపల్లి విన్‌స్టన్‌బాబు శనివారం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల గోపిని మర్యాదపూర్వకంగా కలిశారు. తనను జిల్లా క్రిస్టియన్ మైనారిటీ విభాగం అధ్యక్షునిగా నియమించడం పట్ల పార్టీ అధినేత వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డికి, రీజనల్ కోఆర్డినేటర్ బొత్స సత్యనారాయణకు, జిల్లా అధ్యక్షులు ముదునూరి ప్రసాదరాజుకు, నియోజకవర్గ ఇంఛార్జి గోపికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా యూత్ కార్యదర్శి దేవ రాజేష్, పార్టీ నాయకులు జోగాడ ఉమామహేశ్వరరావు, జోగి వెంకటేశ్వరరావు, గానుబోయిన దుర్గారావు, పీటర్‌సన్, నాగాబత్తుల జాన్, చేరుగొండి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు గాయాలు

నరసాపురం: రైల్వేస్టేషన్‌రోడ్డులోని మురుగుకాలువ వంతెన వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. టౌన్ ఎస్సై సీహెచ్ విజయలక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పిల్లిపేటకు చెందిన తీగిరెడ్డి చినసత్యనారాయణ తన ఆటోలో రాజోలు కిరాయికి వెళ్లి నరసాపురం వస్తున్నాడు. ఈ క్రమంలో పట్టణంలోని మురుగుకాలువ వంతెన వద్దకు వచ్చేసరికి ఎదురుగా పాలకొల్లు వైపు వేగంగా వెళ్తున్న మినీవ్యాన్ ఆటోను ఢీకొట్టింది. దీంతో చిన సత్యనారాయణకు స్వల్పగాయాలయ్యాయి. ఆ సమయంలో ఆటోలో ప్రయాణికులు ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఆటో డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై వివరించారు.

చౌకడిపో డీలర్ల అధ్యక్షుడిగా ఎంబీఆర్



డీలర్స్ నూతన కార్యవర్గ సభ్యులతో కేక్ కట్ చేస్తున్న తహసీల్దార్ దుర్గా కిషోర్

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు మండలం చౌకడిపో డీలర్ల నూతన అధ్యక్షుడిగా మండెల బాబూ రాజేంద్రప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం జరిగిన నూతన కార్యవర్గం ఎన్నికల్లో గత 27 ఏళ్లుగా అధ్యక్షునిగా పని చేస్తున్న మండెల బాబు రాజేంద్రప్రసాద్‌నే డీలర్ సభ్యులు మరోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ డీలర్లకు ఎటువంటి సమస్యలు వచ్చినా వారి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఈ ఎన్నికల్లో సెక్రటరీగా శాగా బాబ్జి, ఉపాధ్యక్షులుగా కోట గణేష్‌బాబు, కోట రాంబాబు, ట్రెజరర్‌గా సిరికొండ శ్రీనివాస్ తదితరులను ఎన్నుకున్నారు. నూతనంగా ఎంపికైన డీలర్స్ అసోసియేషన్ సభ్యులను తహసీల్దార్ యడ్ల దుర్గా కిషోర్ అభినందించారు.

బడ్జెట్‌లో మహిళలకు అన్యాయంపై నిరసన



బడ్జెట్‌పై నిరసన తెలుపుతున్న ఐద్వా సభ్యురాళ్లు

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం కేటాయించిన బడ్జెట్‌లో మహిళలకు సంబందించిన పథకాలకు నిధులు కేటాయించలేదని ఐద్వా జిల్లా కార్యదర్శి పాగాకు పూర్ణ అన్నారు. శనివారం పట్టణంలోని వీవర్స్ కాలనీలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా పూర్ణ మాట్లాడుతూ అమ్మఒడికి నిధులు పూర్తిగా కేటాయించలేదని అన్నారు. డ్వాక్రా మహిళలను మోసం చేశారని, ఉచిత బస్సు ఊసే లేదని అన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నో వాగ్దానాలు చేశారని వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి ఎస్ జయప్రభ, రాష్ట్ర కమిటీ సభ్యురాలు ఎస్.ఉదయ్‌కుమారి, కేతా ప్రభ, బి యశోద, జయ ప్రశాంతి పాల్గొన్నారు.

మహిళల రక్షణపై అవగాహన


ఉమెన్ ప్రొటెక్షన్‌పై అవగాహన కల్పిస్తున్న సీఐ రజనీకుమార్

పాలకొల్లు సెంట్రల్: నేటి సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడుల నుంచి తమను తాము రక్షించుకునే విధంగా మహిళలు చైతన్యవంతులు కావాలని పట్టణ సీఐ కె.రజనీకుమార్ అన్నారు. శనివారం పట్టణ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉమెన్ ప్రొటెక్షన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రజనీకుమార్ మాట్లాడుతూ ముఖ్యంగా ఎవరితోనైనా స్నేహం చేసేటప్పుడు అందరూ మనవాళ్లేనని నమ్మి మోసపోవద్దని సూచించారు. వాట్సాప్, ఫేస్‌బుక్‌ల్లో యువతులు, మహిళలు ఏవైనా ఫొటోలు పెట్టేటప్పుడు గ్రూప్‌లో మనకి తెలియని వాళ్లు ఎవరైనా ఉన్నారా అని ఒకటి పది సార్లు గ్రూప్‌ను తనిఖీ చేసుకుని తమ ఫొటోలు పోస్ట్ చేసుకోవాలన్నారు. అందరూ మనవాళ్లేనని ఫొటోలు పెడితే వాటిని మార్ఫింగ్ చేసి మహిళలను బ్లాక్‌మెయిల్ చేస్తారని, తద్వారా మహిళలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. మీరు సమస్యను గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చేసరికే నష్టం జరిగిపోతుందని సూచించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్సైలు ప్రసాద్, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు


పెనుగొండ ఎస్‌వీకేపీ కాలేజీలో పరీక్ష రూమ్‌లను చూసుకుంటున్న విద్యార్థులు

పెనుగొండ: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు పరీక్షకు 57 మంది గైర్హజరయ్యారని ఎస్‌వీకేపీ కళాశాల పరీక్షా కేంద్ర చీఫ్ సూపరింటెండెంట్ కొల్లి వెంకట రామ సూర్యనారాయణ తెలిపారు. తెలుగు, సంస్కృతం, హిందీ, ఒకేషనల్ జనరల్ ఫౌండేషన్ పరీక్షలు జరిగాయన్నారు. ఎస్వీకేపీలో జనరల్ కోర్సుల్లో 146 మందికి గాను 7గురు, ఒకేషనల్ జనరల్ ఫౌండేషన్ పరీక్షకు 378 మందికి గాను 50 మంది గైర్హజరయ్యారని తెలిపారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి. శనివారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకూ పరీక్షలు నిర్వహించారు. మొదటి రోజు తెలుగు–1, హిందీ–1, సంస్కృతి–1, ఒకేషనల్ జీఎఫ్‌సీ (జనరల్ ఫౌండేషన్ కోర్సు)–1 పరీక్షలు నిర్వహించారు. పట్టణంలో ఏఎస్ఎన్ఎం జూనియర్ కళాశాల, కోకోనట్ జూనియర్ కళాశాల, శ్రీ చైతన్య, శ్రీ విశ్వ, ఆదిత్య, డాక్టర్ సవిత, చాంబర్స్, శ్రీ గౌతమి మొత్తం ఎనిమిది కళాశాలల్లో నిర్వహించారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు కట్టుదిట్టంగా ఏర్పాటుచేశారు.

ఉపాధి పనుల ఆకస్మిక తనిఖీ


కూలీలకు సూచనలు చేస్తున్న అప్పారావు

పెనుగొండ: మండలంలోని దేవలో ఉపాధి పనుల్లో భాగంగా జరుగుతున్న మంచినీటి చెరువు పనులను డ్వామా పీడీ సీహెచ్ అప్పారావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. శనివారం పనులు జరుగుతున్న ప్రాంతాన్ని సందర్శించి పనుల నాణ్యతను పరిశీలించారు. ఉపాధి పనులు జరుగుతున్న ప్రదేశంలో సిబ్బంది దగ్గర ఉండి నిబంధనలు మేరకు పనులు నిర్వహించాలని ఆదేశించారు. అదే విధంగా కూలీలకు గిట్టుబాటు కూలీ వచ్చే విధంగా కొలతలు ఇచ్చి పనులు చేయించాలన్నారు. అనంతరం ఉపాధి కూలీలతో సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో టీఏ శంకర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అత్యంత మధురమైనది తెలుగు భాష

పోడూరు: మధురభాషలకు తలమానికం తెలుగు భాష అని విశ్రాంత ప్రధాన ఆచార్యులు చేగొండి వీరవెంకట సత్యనారాయణమూర్తి అన్నారు. జిన్నూరు జెడ్పీ హైస్కూల్లో పాలకొల్లు రసధుని సాహితీ సంస్థ ఆధ్వర్యంలో శనివారం 'తెలుగు పద్య వైభవం' కార్యక్రమం నిర్వహించారు. అధ్యక్షుడు కొట్టి భాస్కరరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాన వక్త సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ప్రపంచభాషల్లో కంటే అత్యంత మధురమైన భాష తెలుగుభాష అన్నారు. మధురమైన తెలుగుభాషకు నిజమైన వెలుగు పద్యం అన్నారు. అనంతరం కొట్టి భాస్కరరావు మాట్లాడుతూ తెలుగుభాషలో ఉన్నటువంటి అవధానం ప్రక్రియలు మరే ఇతర భాషల్లోనూ లేవన్నారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం సీహెచ్ శివజ్యోతి, చేగొండి రంగారావు, యర్రంశెట్టి వెంకటరత్నం, కోలాటి పెద్దిరాజు, సీహెచ్ వామనమూర్తి పాల్గొన్నారు.